RNI NO. APTELL/ 2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 276 శనివారం 22 ఆగష్టు 2026 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ krk7018@gmail.com పేజీలు :4 రూ॥ 1/-

## అల్లాపూర్ చెరువులో గొర్రెలను కడగడానికి వెళ్లి యువకుడు మృతి!

కామారెడ్డి: కామారెడ్డి జిల్లా పిట్లం మండలం అల్లాపూర్ గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మేకల వినయ్ (18) గొర్రెలను కడగడానికి గ్రామంలోని చెరువులోకి వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. వినయ్ గల్లంతైన విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. గల్లాంతైనా యువకుడి ఆచూకీ లభించకపోవడంతో అప్రమత్త మైన గ్రామస్తులు అగ్ని మపక సిబ్బంది, రిస్క్యు టీం వారికి సమాచారం ఇవ్వడం తో సమాచారం అందుకున్న మద్నూర్ ఫైర్ సిబ్బంది,

## లోకేశ్వరం మండలంలో విజిలెన్స్ తనిఖీలు: రూ.25 కోట్ల ధాన్యం మాయం!

నిర్మల్ జిల్లా ముధోల్ తాలూకా లోకేశ్వరం మండలంలోని నగర్ ప్రాంతంలో గల రెండు రైస్ మిల్లులో శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టరు. కె.ఎస్.ఆర్ రైస్ మిల్లులో తనిఖీలు చేయగా దాదాపు రూపాలు 12 కోట్ల వరకు ధాన్యం లోటుగా ఉన్నట్లు సమాచారం. అలాగే శ్రీ లక్ష్మీనరసింహ రైస్ మిల్లులో తనిఖీలు నిర్వహించగా దాదాపు రూపాలు 13 కోట్ల వరకు ఉన్నట్లు సమాచారం.రైస్ మిల్లుల యజమానులు షి.శ్రీనివాస్, కె. మాలతిల పై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

# పొమ్మనరు పొగబెడతారు.



స్పందించాల్సిన సమయం వచ్చింది. అందుకే రెబల్స్‌పై తనదైన శైలిలో స్పందిస్తున్నారు సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన రాష్ట్రంలో లేనప్పుడు జరిగిన రెబల్ కామెంట్స్‌పై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో దండయాత్ర చేయించడం తన బల ప్రదర్శనగానే చూడాలి. కొండా సురేఖపై ఏకంగా 15 మంది ఎమ్మెల్యేలు, ఐదుగురు ఎమ్మెల్సీలు ప్రెస్‌మీట్ పెట్టి ఆమెను రాజీనామా చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. రేవంత్ రెడ్డి డైరక్షన్‌లోనే ఇది జరిగినట్టుగా భావిస్తున్నాయి రాజకీయ వర్గాలు. మొన్నటి వరకు సైలెంట్ ఉన్నా.. రేవంత్ ఇక ఇలాంటి నేతలపై తన ప్రతాపం చూపేందుకు రెడీ అయినట్టుగా తెలుస్తోంది. ఓవైపు ప్రధాన ప్రతిపక్షం బలోపేత మవుతూ వస్తున్న తరుణంలో సొంత పార్టీలో ఈ కుంపట్లను ఆర్పకపోతే మరింత నష్టం జరుగుతుందనే భావనలో ఆయన ఉన్నట్లుగా చెబుతున్నారు. అయితే తన వ్యూహంలో భాగంగా ఎవరిపైనా చర్యలు తీసుకోవద్దనే సీఎం భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. చర్యలు తీసుకుంటే ఇక ఇదే పనిగా పెట్టుకుని.. మరింత దూకుడుగా ఆరోపణలు, విమర్శలు చేయడానికి ఆస్కారమిచ్చినట్టుగా అవుతుందని అంచనా వేస్తున్నారాయన.

## 3000 మంది ఉద్యోగులకు భారీ ఊరట.. 22 రిక్రూట్‌మెంట్ పరీక్షల రద్దుపై హైకోర్టు స్టే

జార్ఖండ్ ప్రభుత్వం ఇటీవల 22 విభిన్న రిక్రూట్మెంట్ పరీక్షలను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పేపర్ లీకేజ్ ఆరోపణల నెపంతో హేమంత్ సోరెన్ ప్రభుత్వం ప్రైవేట్ ఏజెన్సీ నిర్వహించిన పరీక్షలన్నింటినీ రద్దు చేస్తూ నోటిఫికేషన్ ఇచ్చింది. దీనివల్ల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సివిల్ జడ్జిలు, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు, డిప్యూటీ కలెక్టర్లు, జేఎస్ఎస్సీ-సిజిఎల్ ద్వారా ఎంపికైన దాదాపు 3000 మంది అర్హులైన ఉద్యోగులు వీధిపాలయ్యే పరిస్థితి వచ్చింది. విచారణ జరిపిన న్యాయస్థానం ప్రభుత్వ నిర్ణయంపై స్టే విధిస్తూ, బాధితులందరినీ వెంటనే విధుల్లో చేర్చుకోవాలని ఆదేశించింది.

అభ్యర్థుల వైపు నుంచి దాఖలైన వాదనలతో ఏకీభవించిన హైకోర్టు ప్రాథమిక సూత్రాలను గుర్తుచేసింది. ప్రతి అభ్యర్థికి వ్యక్తిగతంగా విచారణ అవకాశం ఇవ్వకుండా, ఎవరు అక్రమాలకు పాల్పడ్డారో నిరూపించకుండా ఒకేసారి 22 పరీక్షలను రద్దు చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 21 కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన కీలక తీర్పులను ఉదహరిస్తూ.. నేరానికి పాల్పడిన 'దాగి' అభ్యర్థులను, నిజాయితీగా రాసిన 'బెదాగ్' అభ్యర్థులను వేర్వేరుగా గుర్తించే అవకాశం ఉన్నప్పుడు మొత్తం పరీక్షలనే రద్దు చేయడం సరికాదని అభిప్రాయపడింది.

ఈ వ్యవహారంలో తదుపరి చర్యల కోసం రాష్ట్ర క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సిఐడి), స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) లకు బాధ్యతలు అప్పగించే యోచనలో కోర్టు ఉంది. అక్రమాల వల్ల లబ్ధి పొందిన వారి పూర్తి జాబితాను రూపొందించి కేవలం వారి నియామకాలను మాత్రమే రద్దు చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీనివల్ల కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించిన వేలాది మందికి న్యాయం జరిగే అవకాశం ఏర్పడింది. దాదాపు 26 రోజుల పాటు విద్యార్థి సంఘాలు రోడ్లపైకి వచ్చి చేసిన ఆందోళనల నేపథ్యంలో ఈ తీర్పు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## అమిత్ షా ను వెంటాడుతున్న రాహుల్!

### పెల్లెట్ గన్ బాధితుడితో కలిసి పోరాటం..

### విద్యార్థులపై లాఠీ ఎత్తాలంటేనే జంకుతున్న కేంద్రం..



నిను వీడని నీడను నేనే.. అన్నట్టుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షాను వదలడం లేదు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ. జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ పార్టీ ఆందోళన ఉద్రిక్తంగా మారిన నాటి నుంచి అమిత్ షాను టార్గెట్ చేస్తున్నారాయన. విద్యార్థులపై లాఠీ చార్జి చేయడమే కాదు.. టియర్ గ్యాస్ ప్రయోగించారు. రబ్బర్ బుల్లెట్లు వాడి వారిని గాయపరిచారు. దీనిపై రాహుల్ అప్పటి నుంచి పోరాటం చేస్తూనే ఉన్నారు. పెల్లెట్ గన్ దెబ్బకు తన చూపు కోల్పోయిన విద్యార్థితో కలిసి ఇవాళ ఉదయం నుంచి ఢిల్లీలో ఆందోళన చేశారు రాహుల్.

## డిమాండ్లు నెరవేరే వరకు సమ్మె ఆపేది లేదు : జూడాలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ డాక్టర్లు (జూడాలు) తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన గళం విప్పారు. స్టైపెండ్ పెంపుతో పాటు సీనియర్ రెసిడెంట్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన, అధికారిక హామీ లభించేంత వరకు తమ సమ్మెను విరమించేదే లేదని జూనియర్ డాక్టర్ల సంఘం తేల్చిచెప్పింది. తమ న్యాయమైన డిమాండ్లపై గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నామని, అయినా ఎలాంటి సానుకూల నిర్ణయం తీసుకోకపోవడంతోనే 14 రోజుల సమ్మతి గడువు ముగిసాక విధిలేని పరిస్థితుల్లో ఈ నిరసన బాట పట్టామని మీడియా సమావేశంలో స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ, తమ సంక్షేమాన్ని ప్రభుత్వం విస్మరించడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.స్టైపెండ్ పెంపు అంశంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై జూడాలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యావసరాల ధరలు, వైద్య విద్యా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో స్టైపెండ్‌ను 30% పెంచాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం 15% పెంపుకే ప్రతిపాదన తేవడం అన్యాయమని పేర్కొన్నారు. కనీసం 20% పెంపునకైనా ప్రభుత్వం అంగీకరించాలని, అలాగే సీనియర్ రెసిడెంట్ల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. వైద్యాధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి తమ న్యాయమైన కోరికలను తీర్చాలని, లేనిపక్షంలో నిరసనలను మరింత తీవ్రతరం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.

## జీవో 150తో నీట్ విద్యార్థులకు అన్యాయం..

### 1600 మెడికల్ సీట్లు పోతాయ్.. కల్వకుంట్ల కవిత ఆవేదన




తెలంగాణ సర్కార్ తీసుకొచ్చిన జీవో 150పై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రంగా మండిపడ్డారు. ఆ జీవో 150తో నీట్ విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. కేవలం నాలుగేళ్లు తెలంగాణలో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించే నిబంధన వల్ల తెలంగాణ విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కారణంగా మెడిసిన్‌లో సుమారు 1,600 సీట్లు ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వెళ్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ జీవోను తక్షణమే సర్కార్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో నీట్ విద్యార్థుల స్థానికత అంశం మరోసారి రాజకీయంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 150తో తెలంగాణ విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఈ జీవో 150పై నీట్ అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పలువురు నీట్ అభ్యర్థుల తల్లిదండ్రులు కల్వకుంట్ల కవితను కలిసి తమ సమస్యలను వివరించారు. ఆ తర్వాత ఆమె ప్రభుత్వం అనాలోచితంగా నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కేవలం 4 ఏళ్లు తెలంగాణలో చదివిన విద్యార్థులను స్థానికులుగా పరిగణించేలా జీవో 150లో నిబంధనలు తీసుకురావడం వల్ల రాష్ట్ర విద్యార్థులకు నష్టం





## అంకాపూర్ గ్రామాన్ని సందర్శించిన మంత్రి పొంగులేటి

### నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించిన మంత్రి

ఆర్మూర్ ఆగస్ట్ 21(ప్రజగళం) ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస సందర్శించారు. అంకాపూర్ లో కొనసాగుతున్న డబుల్ బెడ్రూముల నిర్మాణం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి తో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ పరిశీలించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే సొంత గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులను వేగవంతం చేస్తూ, నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ల నిర్మాణ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగులు లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలో మంజూరు చేయాలని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. ఆలూరు ఎమ్మార్వో కార్యాలయం, నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు కు హామీ ఇచ్చారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ కు ఘనసవతం పలితాలు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షులు నగేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, స్థానిక సర్పంచ్ దేవేందర్ , కాంగ్రెస్ నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయదుర్గం భూముల వివాదం.. పిటిషనర్‌కు సుప్రీంకోర్టు బిగ్ షాక్



రాయదుర్గం పాన్ మక్తా భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకోమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. దీనికి సంబంధించి ఏ విషయాన్నయినా తెలంగాణ హైకోర్టులో తేల్చుకోవాలని సూచించింది. రాయదుర్గం పాన్ మక్తాలోని రెండు సర్వే నెంబర్లలో ఉన్న 11 ఎకరాల భూమిని అమ్మేందుకు టీజీఐఐసీ వేలం జరపాలని నిశ్చయించింది. అయితే దీనిపై జువ్వాడి ప్రణయ సింహారావు సుప్రీం కోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది. ఈ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ గతంలో కంచె గచ్చిబౌలి భూములపై సుప్రీం కోర్టు స్టే ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పుడు రక్షించమని చెప్పిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన అభిషేక్ సింఘ్వీ..పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టిస్తు న్నార న్నారు. కంచె గచ్చిబౌలి భూములకు ఇప్పుడు వేలం వేయటానికి నోటిఫికేషన్ ఇచ్చిన భూమికి ఎలాంటి సంబంధం లేదని చెప్పారు. ఈ భూములు కంచె గచ్చిబౌలి భూములకు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని తెలిపారు. ఈ వాదనలను పరిగణలోకి తీసుకున్న సుప్రీం కోర్టు భూముల వేలానికి సంబంధించి టీజీఐఐసీ ఇచ్చిన నోటిఫికేషన్ లో ఎలాంటి జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణకు నిరాకరించింది.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శనివారం
22 -08-2026

## సంపాదకీయం

### ప్రధాని వాగ్దానం - కృత్రిమ మేధస్సు

'హర్ ఘర్ త్రివర్ణ', జాతీయ గీతం వందేమాతరం ఆలాపనతో మనం ఎనభయ్యవ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకున్నాం. దేశభక్తులు, దేశద్రోహులపై చర్చలు, విదేశీయులను గుర్తించి వారిని వేరు చేయడం–వెనక్కి పంపడం, ఆత్మనిర్భర భారత్, మేక్ ఇన్ ఇండియా – ఇవి స్వాతంత్ర్య దినోత్సవం నాడు చర్చించే కార్యక్రమాలు. కానీ ఈసారి కాస్త భిన్నంగా ఉంది. గౌరవనీయ ప్రధాని ప్రసంగంలో యువతను లక్ష్యంగా చేసుకున్న కొన్ని ప్రాజెక్టులకు చోటు లభించింది. వాటిలో, వచ్చే ఏడాది కోటి మంది యువతకు కృత్రిమ మేధస్సు(ఎ.ఐ)లో శిక్షణ ఇవ్వడం మీడియాలో అత్యధికంగా చర్చ జరిగిన ప్రాజెక్ట్. అంతేకాకుండా, డిజిటల్ మాధ్యమం ద్వారా పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు యువతకు కోచింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. కొద్ది నెలల క్రితమే నరేంద్ర మోడీ ప్రభుత్వానికి యువత నుంచి ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో, ప్రధానమంత్రి యువతను ప్రసన్నం చేసుకోవడానికి తన వంతు ప్రయత్నం చేస్తారని భావించవచ్చు. అయితే, రెండు రోజుల క్రితం విద్యావిషయాలకు సంబంధించిన లోక్‌సభ కమిటీ ప్రచురించిన ఒక నివేదిక ప్రకారం, మన దేశంలో 73 శాతం మంది బాలురు, బాలికలు ఉన్నత మాధ్యమిక స్థాయికి చేరుకోక ముందే చదువు మానేస్తున్నారు. 10.9 లక్షల ప్రభుత్వ, ప్రభుత్వ–నిర్వహణ పాఠశాలల్లో కేవలం 90,866 పాఠశాలలు మాత్రమే ఉన్నత మాధ్యమిక స్థాయిని చేరుకోగలిగాయి. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు దాదాపు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలలను మాధ్యమిక లేదా ఉన్నత మాధ్యమిక స్థాయిలకు అభివృద్ధి చేయకపోవడంతో... చాలా మంది బాలబాలికల ఇళ్ల సమీపంలో ఉన్నత మాధ్యమిక పాఠశాలలు వుండడంలేదు. వారు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లలేకపోవడం, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే స్థోమత లేకపోవడం వల్ల, పాఠశాలలో తమ విద్యను కొనసాగించాలనే కల నెరవేరకుండానే మిగిలిపోతున్నది. ఒకవేళ ఎవరైనా ఉన్నత మాధ్యమిక స్థాయిని దాటి ఉన్నత విద్యాసంస్థలో ప్రవేశించినా – అక్కడ చివరి వరకు చదవడం సాధ్యం కాదు. జులై 2026లో ప్రచురించబడిన ఒక నివేదిక (బియాండ్ ఎన్‌రోల్‌మెంట్: ఇండియాస్ హయ్యర్ ఎడ్యుకేషన్ కంప్లీషన్ గ్యాప్, కళ్యాణి అయ్యర్) ప్రకారం, ఉన్నత విద్యలో ప్రవేశించిన తర్వాత కూడా 30 నుండి 50 శాతం మంది విద్యార్థులు తమ చదువును పూర్తి చేయడం లేదు. వారు తమ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయక ముందే చదువు మానేస్తున్నారు. లేదా మానేయమని ఒత్తిడి వస్తున్నది. వారి చదువును కొనసాగించడానికి కుటుంబాల దగ్గర శక్తి లేకపోవడం, కుటుంబ అవసరాల కారణంగా వారు ఉద్యోగంలో చేరుతున్నారు. అదే ఆడపిల్లల విషయంలోనైతే చిన్న వయసులోనే వివాహం చేసేయడంతో చదువు మానేయాల్సి వస్తోంది. గ్రాడ్యుయేషన్ తర్వాత ప్రత్యేక ఉపాధి అవకాశాలు లేనందున, వారి చదువును కొనసాగించాల్సిన అవసరం లేదని కుటుంబాలు భావిస్తాయి. అందువల్ల, అబ్బాయిలు చదువు మానేసి కాంట్రాక్ట్ ఉద్యోగంలో చేరడం, గిగ్ వర్కర్లుగా మారడం జరుగుతుంది. నూతన జాతీయ విద్యా విధానం–2020లో ఉన్నత విద్యలో 'జ్ఞానం' కంటే 'నైపుణ్యాల'పై ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడింది. కాబట్టి, నాలుగేళ్ల అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో ఇంటర్న్‌షిప్‌లు, బహుళ–విషయ అధ్యయనాలకు ప్రాధాన్యత ఇవ్వబడింది. ఉన్నత విద్యలో పురోగతి కోసం 2035 నాటికి స్థూల నమోదు నిష్పత్తి లేదా మొత్తం నమోదు రేటు లక్ష్యాన్ని 50 శాతానికి పెంచాలని విద్యా విధానం పేర్కొంది. అయితే, నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత, విద్య పూర్తయ్యాక తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోతే, చాలా కుటుంబాలకు తమ పిల్లల నాలుగేళ్ల చదువును కొనసాగించడం సాధ్యం కావడం లేదని తెలుస్తున్నది. సాధారణంగా, సైన్స్/సాంఘిక శాస్త్రాలలో ఏదైనా సబ్జెక్టులో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో చదవాలనే విద్యార్థుల కోరిక తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. మరోవైపు, ఇంజనీరింగ్, మెడిసిన్, మేనేజ్‌మెంట్ వంటి వృత్తిపరమైన సబ్జెక్టులను అభ్యసించడం పెరిగినప్పటికీ, ట్యూషన్ ఫీజులు సామాన్యుడికి అందుబాటులో లేవు. దేశంలోని ప్రఖ్యాత ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి రూ.5 లక్షలకు పైగా ఉన్నాయి. సాధారణంగా, ఏ ప్రైవేట్ కళాశాలలోనైనా ఇంజనీరింగ్ చదవడానికి కనీస ఖర్చు సంవత్సరానికి రూ.1 లక్షకు పైగా ఉంటుంది. ఇంజనీరింగ్ చదవడానికి దేశంలో ఐఐటీలు ఉత్తమ విద్యాసంస్థలు. అవి ప్రభుత్వ విద్యాసంస్థలు అయినప్పటికీ, ఐఐటీల ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి సుమారు రూ.2 లక్షలు ఉంటాయి. ప్రైవేట్ కళాశాలల్లో మెడిసిన్ చదవడానికి ట్యూషన్ ఫీజులు సంవత్సరానికి రూ.4.5 లక్షల నుండి రూ.25 లక్షల వరకు అవసరం. మరో మాటలో చెప్పాలంటే, మీరు ప్రతిభ పరంగా అగ్రశ్రేణుల్లో లేకపోతే, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు కూడా వైద్య విద్య అందుబాటులో ఉండదు. అంతే కాదు. ఈ పోటీ ప్రపంచంలో, ఇంజనీరింగ్, వైద్య, అన్ని ఇతర ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాలు ఎం.సి.క్యు (బహుళైచ్ఛిక ప్రశ్నలు) పద్ధతిలో తయారు చేయబడుతున్నాయి. ఫలితంగా, పాఠశాల విద్య–ప్రతిభ మాత్రమే సరిపోవడం లేదు. ప్రవేశ పరీక్షలలో విద్యార్థులకు మంచి ర్యాంకులు ఇప్పిస్తామని గొప్ప వాగ్దానాలతో వివిధ కోచింగ్ సెంటర్లు రంగంలోకి దిగుతున్నాయి. ఈ కోచింగ్ సెంటర్ల నిర్వహణ ఖర్చుల బాధ్యత కూడా కుటుంబాలపైనే పడుతుంది. అంతేకాకుండా, వైద్య విద్య ప్రవేశ పరీక్ష–నీట్ 2026 ప్రశ్నాపత్రం లీక్ అవ్వడంతో ఆ పరీక్ష రద్దు చేయబడింది. దీనికి సంబంధించి మనం అపూర్వమైన విద్యార్థి ఉద్యమాన్ని చూస్తున్నాము. ఈ కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు కూడా ఆ ప్రశ్నాపత్రం లీక్‌లో పాలుపంచుకున్నారు. కాబట్టి సహజంగానే, ప్రస్తుతం ఈ ప్రవేశ పరీక్షలన్నింటిలో ఎంత ప్రతిభను పరిగణనలోకి తీసుకుంటున్నారు? ఎంత డబ్బు ఖర్చు చేస్తున్నారు? అనే ప్రశ్న తలెత్తుతుంది. ఫలితంగా, చాలా మంది విద్యార్థులు ఉన్నత మాధ్యమిక విద్య ఉత్తీర్ణులైన తర్వాత కూడా ఉన్నత విద్యాలయాల్లోకి ప్రవేశించలేకపోతున్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో, విద్యా రంగంపై కేంద్ర ప్రభుత్వ వ్యయం రూ.1,28,650 కోట్లుగా ఉంది. ఇందులో, పాఠశాల విద్యకు రూ.78,572 కోట్లు, ఉన్నత విద్యకు రూ. 50,078 కోట్లు కేటాయించారు. ఈ కేటాయింపులో, దేశంలోని 27 ఐఐటీలకు రూ. 12,123 కోట్లు, 56 కేంద్ర విశ్వవిద్యాలయాలకు రూ. 17,440 కోట్లు కేటాయించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ)లో పరిశోధన కోసం సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయడానికి బడ్జెట్‌లో అధిక భాగాన్ని కేటాయించారు. ప్రపంచంలో భారతీయ విద్యా సంస్థలను ఉన్నత స్థానంలో నిలపడానికి ప్రపంచ స్థాయి విద్యా సంస్థల అవసరం నిస్సందేహంగా ఉంది. కానీ పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉన్నత విద్య నుండి మధ్యలోనే మానేస్తున్నప్పుడు... పరిమితంగా వున్న ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు ఈ వెనుకబడిన విద్యార్థుల జీవితాలలో ఎలాంటి మార్పును తీసుకురాలేవు. విద్య ప్రాథమిక అవసరాలను పక్కన పెడితే, దేశంలోని 15 నుండి 29 సంవత్సరాల మధ్య వయస్సుగల 27 శాతం యువత భవిష్యత్తుకు సంబంధించిన వృత్తికి ప్రాధాన్యత ఇవ్వకుండా ఏ విద్యా వ్యవస్థను మెరుగుపరచలేము. బడ్జెట్ కేటాయింపులు, ప్రాజెక్టులలో ఆకర్షణీయమైన వాగ్దానాలు చేసినప్పటికీ, విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి కేంద్ర ప్రభుత్వం చాలా తక్కువ వనరులను వినియోగిస్తున్నది. ఈ పరిస్థితుల్లో, స్వాతంత్ర్య దినోత్సవం నాడు కోటి మంది యువతకు కృత్రిమ మేధస్సు (ఎ.ఐ) లో శిక్షణ ఇస్తామని ప్రధాని ప్రకటించారు. అయితే ఏ స్థాయి శిక్షణ ఇస్తారు, శిక్షణ తర్వాత ఎలాంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు అనే దానిపై స్పష్టత లేదు. కానీ ఒక విషయం మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. అదేమిటంటే, ప్రపంచంలోని ఇతర దేశాలలో నూతన సాంకేతికతలలో జరుగుతున్న పురోగతిలో మన యువతను భాగస్వాములను చేయాలంటే...కళాశాల, విశ్వవిద్యాలయ స్థాయి విద్యకు ప్రాధాన్యత ఇవ్వకుండా కేవలం స్వల్పకాలిక శిక్షణతో ఎటువంటి పురోగతి సాధ్యం కాదు.

# ఇథనాల్ ఉత్పత్తిలో చక్కెర.. ధరల పెరుగుదలకు కారణం అదేనా?

- చక్కెర ధరలపై కేంద్రం స్పష్టత
- ఇథనాల్ మళ్లింపే కారణం కాదు
- ధరల అదుపునకు ముమ్మర చర్యలు




దేశంలో ఇటీవల చక్కెర ధరలు పెరగడంపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ స్పందిస్తూ కీలక విషయాలను వెల్లడించింది. పెట్రోల్‌లో కలిపే ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడం వల్లే మార్కెట్‌లో వీటి ధరలు పెరిగాయంటూ వస్తున్న విమర్శల్లో నిజం లేదని స్పష్టం చేసింది. దేశీయంగా చక్కెర దిగుబడి తగ్గడం, పండగల వేళ ప్రజల నుండి డిమాండ్ భారీగా పెరగడమే ప్రధాన కారణాలని పేర్కొంది. దీనితో పాటు అంతర్జాతీయ సరఫరాల్లో అంతరాయం, పంట నష్టం, ఊహాగానాల వల్ల కొంతమంది వ్యాపారులు అక్రమంగా నిల్వలు పెంచడం కూడా ధరల పెరుగుదలకు దోహదం చేశాయని వెల్లడించింది. విపక్షాల విమర్శలను తిప్పికొడుతూ.. ఇథనాల్ తయారీకి మళ్లించే చక్కెర వాటా 2022–23లో 12 శాతంగా ఉండగా, 2025–26 నాటికి అది 9 శాతానికి తగ్గిందని గణాంకాలతో సహా వివరించింది. అంతేకాకుండా దేశంలో దాదాపు మూడోవంతు ఇథనాల్‌ను మొక్కజొన్న వంటి ఇతర ధాన్యాల నుంచే ఉత్పత్తి చేస్తున్నట్లు తెలిపింది. జులై 20న కిలో రూ.48.18గా ఉన్న సగటు ధర ఆగస్టు 20 నాటికి రూ.55.70కి చేరడంతో సాధారణ ప్రజలకు ఉపశమనం కలిగించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మార్కెట్‌లో చక్కెర లభ్యతను పెంచి ధరలను అదుపులోకి తీసుకురావడానికి ప్రభుత్వం నిల్వలపై కఠిన పరిమితులు విధించింది. అలాగే విదేశాల నుంచి చక్కెర దిగుమతులను సులభతరం చేసేందుకు దిగుమతి సుంకాలను సైతం తగ్గించినట్లు మంత్రిత్వ శాఖ ప్రకటించింది. రాబోయే రోజుల్లో మార్కెట్‌లో సరఫరా పెరిగి ధరలు సాధారణ స్థితికి చేరుకుంటాయని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# రాజస్థాన్‌లో సీజేపీ బృందానికి షాక్.. స్కూళ్ల పరిశీలనకు వెళ్తే గ్రామస్తుల ఆగ్రహం.. రాళ్లతో దాడి

## రాజస్థాన్‌లో సీజేపీపై దాడి
## రాళ్లతో కార్యకర్తలను కొట్టిన స్థానికులు
## ఈవెంట్‌పై విమర్శలు చేసిన నాయకులు



రాజస్థాన్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల పరిశీలనకు వెళ్లిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) బృందానికి చేదు అనుభవం ఎదురైంది. 'స్కూల్ ఠీక్ కరో' కార్యక్రమంలో భాగంగా సీజేపీ కో–కన్వీనర్ అశుతోష్ రంకా నేతృత్వంలో కార్యకర్తలు జైపూర్ జిల్లాలోని రాంపురా కన్వర్‌పురా గ్రామానికి వెళ్లేందుకు యత్నించగా, ఊరి శివారులోనే స్థానికులు వారిని అడ్డుకున్నారు. తమ స్కూళ్లను తామే బాగు చేసుకుంటామని చెబుతూ వారిని బలవంతంగా వెనక్కి పంపించేశారు. ఈ క్రమంలో స్థానికులు తమపై రాళ్లతో దాడి చేసి, వాహనాలను ధ్వంసం చేశారని అశుతోష్ ఆరోపించారు. ఈ దాడి ఘటనపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో స్పందిస్తూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడులకు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ, రాజస్థాన్‌లోని బీజేపీ ప్రభుత్వమే ఈ దాడికి కారణమని విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తలపై రాళ్లు విసిరి గాయపరిచారని, ఘటన జరుగుతున్న సమయంలో పోలీసులు అక్కడికి రాకపోవడం దారుణమని మండిపడ్డారు. రాష్ట్రంలో గూండాల పాలన నడుస్తోందని ఆయన ఆరోపించారు. పాఠశాలల సౌకర్యాల పరిశీలన కోసం వెళ్లిన ఒక బృందంపై ఈ స్థాయిలో విరుచుకుపడటం, వాహనాలను ధ్వంసం చేయడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ స్థానిక యంత్రాంగం సరిగ్గా స్పందించలేదని సీజేపీ నేతలు ఆరోపిస్తుండగా, ఈ ఘటనపై రాజస్థాన్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

# పొమ్మనరు పొగబెడతారు.

అందుకే.. సీఎం రేవంత్‌తో పెట్టుకుంటే పార్టీలో పుట్టగతులుండవనే సిగ్నల్స్ ఇవ్వడం ద్వారా వారిని కంట్రోల్ పెట్టాలనే ఆలోచన అమలులో పెట్టాలనుకుంటున్నారు. కొండా సుష్మిత ఏకంగా రేవంత్ తమ్ముడిపై తీవ్ర ఆరోపణలు చేయడమే కాదు.. నా జోలికొస్తే ఇక అన్నీ బయటపెడతాననడం వెనుక బలమైన రాజకీయ శక్తుల హస్తమున్నట్టుగా భావిస్తున్నారు. నేరుగా బెదిరింపులకు దిగడం మూలంగా ఐతే లాభం లేకపోతే.. ఇతర పార్టీలోకి వెళ్లి.. తాము అనుకున్నది సాధించుకోవాలనే వ్యూహాన్ని కొండా ఫ్యామిలీ అమలు చేస్తున్నట్టుగా అనుమానిస్తోంది అధిష్టానం. అందుకే తమంతట తాముగా చర్యలు తీసుకోవద్దని భావనలో ఉన్నారు. కానీ టిట్ ఫర్ టాట్ లాగా కొండా కుటుంబానికి, రెబల్ నేతలకు తన టీమ్‌తో గట్టిగా వార్నింగులు, కౌంటర్లు, ఆరోపణలు చేయించేలా సిగ్నల్స్ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. ఇవాళ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పెట్టిన మీటింగులో కొండాను ప్రధానంగా టార్గెట్ చేయడంతో పాటు రెబల్స్ అందరినీ కట్టగట్టి తిట్టిపోశారు. వీరందరిపై చర్యలు తీసుకోవాలని చెప్పడమే కాదు.. అవసరమైతే ఢిల్లీకి పోయి కేసీ వేణుగోపాల్, ఖర్గేలను కూడా కలుస్తామని చెప్పడం.. దీన్ని అంత ఆషామాషీగా తీసుకోవడం లేదనే హెచ్చరికను వీరికి పంపారు. ఇదిలాగే కొనసాగితే స్వయంగా రేవంత్.. ఈ టీమ్‌ను ఢిల్లీకి పంపినా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలూ వినిపిస్తున్నాయి. అయితే వీరిని పార్టీలో కొనసాగిస్తూనే సర్కార్ నుంచి మాత్రం సహాయ నిరాకరణే కొనసాగేలా రేవంత్ వ్యూహం రచిస్తున్నారు. అడపా దడపా ఇలా ఆరోపణలు చేస్తే వెంటనే కౌంటర్ దాడులు కొనసాగుతాయి. లేదా వారంతట వారే ఇతర పార్టీలకు వెళ్లిపోవాలి. ఇదే రేవంత్ మార్క్ దండయాత్రగా కొనసాగనుంది. ప్రతిపక్షాలకు ఈ అంశం అస్త్రంగా మారకుండా పొమ్మనరు.. వారంతట వారు వెళ్లిపోయేలా పొగబెడ్తారన్నమాట!

# అమిత్ షా ను వెంటాడుతున్న రాహుల్!

బాధిత విద్యార్థి ఫిర్యాదు చేసినా ఎందుకు ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పోలీసులపై ఒత్తిడి పెంచారు. దీంతో ఎఫ్ఐఆర్ నమోదు చేయక తప్పలేదు పోలీసులకు. మొన్న పార్లమెంటులో అమిత్ షాను నిలదీసే క్రమంలో చేసిన ఇండి కూటమి పోరాటం ఫలించింది. సభకు హాజరు కాకుండా తప్పించుకునే పరిస్థితి ఏర్పడింది కేంద్ర మంత్రికి. సభకు రావాలని, క్షమాపణ చెప్పాలని, రాజీనామా చేయాలని రాహుల్ చేసిన పోరాటం.. బీజేపీ పెద్దలను ఇబ్బంది పెట్టింది. ఇకపై జంతర్ మంతర్ వద్దే కాదు.. ఢిల్లీలో ఎక్కడ యువత ఆందోళన చేసినా.. విద్యార్థులు ఎక్కడ రోడ్డెక్కినా లాఠీలు ఎత్తాలంటేనే భయపడే పరిస్థితిని క్రియేట్ చేశారు రాహుల్ గాంధీ. ఆది నుంచి ఆయన జెన్‌జీలకు మద్దతుగానే ఉంటూ వస్తున్నారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తున్ననాటి నుంచి తన సంఘీభావం తెలుపుతూ వస్తున్నారు. పార్లమెంటు ముట్టడి ఉద్రిక్తంగా మారిన తరుణంలో వారికి అండగా ఉండి .. కాంగ్రెస్ కూటమితో కలిసి మెరుపు ధర్నా చేసి యువతకు మరింతగా దగ్గరయ్యారు. ఏ వేదిక మీదెక్కినా ఈ అంశాన్ని వదలడం లేదు రాహుల్. అమిత్ షాను వెంటాడుతూనే ఉన్నారు. ఇప్పటికీ రాజీనామా చేయాలనే డిమాండ్‌ను సజీవంగానే ఉంచుతున్నారు. అమిత్ షా దీన్ని మరిచిపోదామని అనుకున్నా.. మరవనీయకుండా జంతర్ మంతర్ చేదు అనుభవాలను జ్ఞప్తికి తెస్తూ ఇబ్బంది పెడుతున్నారు. రాజకీయంగా ఇరుకున పెడుతున్నారు. తాజాగా పెల్లెట్ గన్ బాధితుడి ఫిర్యాదు మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడమంటే కేంద్రం తన తప్పు ఒప్పుకోవడమే అవుతుంది. రాహుల్ వ్యూహంలో అమిత్ షా, మోడీ ద్వయం చిక్కుకున్నారని ఈ ఉదంతం తెలియజేస్తోంది.

## జీవో 150తో నీట్ విద్యార్థులకు అన్యాయం..

జరుగుతుందని కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న ప్రధాన ఉద్దేశాల్లో భవిష్యత్ తరాలకు న్యాయం చేయడం కూడా ఒకటని ఆమె గుర్తుచేశారు. తెలంగాణలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో స్థానిక విద్యార్థులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా నిబంధనలు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు.

జీవో 150 అమలుతో మెడిసిన్‌లో సుమారు 1,600 సీట్లు తెలంగాణ విద్యార్థులకు కాకుండా ఇతర రాష్ట్రాల విద్యార్థులకు వెళ్లే పరిస్థితి ఏర్పడుతుందని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజీల్లో ఇతర ప్రాంతాల విద్యార్థులకు ఎక్కువ అవకాశాలు కల్పించడం సరికాదని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. జీవో 150ను పూర్తిగా రద్దు చేయడం సాధ్యం కాకపోతే.. దానికి అనుబంధంగా నిబంధనలను సవరించాలని కల్వకుంట్ల కవిత సూచించారు. కనీసం 7 ఏళ్లపాటు తెలంగాణలో చదివిన విద్యార్థులను మాత్రమే స్థానికులుగా పరిగణించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల తెలంగాణలో దీర్ఘకాలంగా చదువుతున్న విద్యార్థులకు మెడికల్ సీట్లలో న్యాయం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ఇప్పటికే నీట్ విధానం కారణంగా తెలంగాణ విద్యార్థులు 15 శాతం సీట్లను కోల్పోతున్నారని కల్వకుంట్ల కవిత గుర్తు చేశారు. తెలంగాణ రక్షణ సేన తరఫున నీట్ విధానాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....
ప్రజాగళం
తెలుగు దినపత్రిక
శనివారం
22 -08-2026

# నీట్ (పీజీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా.




నిజామాబాద్, ఆగస్టు 21 ( ప్రజాగళం ప్రతినిధి ) ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీట్(పీ.జీ) పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. ఈ నెల 30న జరుగనున్న నీట్ (పీజీ)-2026 పరీక్షను పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులతో ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. జిలాలో నీట్(పీ.జీ) పరీక్షకు 265 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అర్సపల్లిలోని ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ లో 175 మంది, మల్లారంలోని షిఫ్ట్ టెక్నాలజీస్ సెంటర్ లో 90 మంది పరీక్షకు హాజరవుతారని కలెక్టర్ వివరించారు. ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని, అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. కాగా, ఇటీవల చోటుచేసుకున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని నీట్(పీ.జీ) పరీక్ష నిర్వహణలోనూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ ధృవీకరణ పరికరాలు, విద్యుత్, తాగునీరు, వైద్య సదుపాయాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని, అభ్యర్థుల గుర్తింపు ప్రక్రియను కట్టుదిట్టంగా అమలు చేయడంతో పాటు పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ రాజశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి.

## రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.

### - కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి సమీక్ష.





నిజామాబాద్, ఆగస్టు 21(ప్రజాగళం ప్రతినిధి) : రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం రూ.2,800 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. నిర్వాసితులకు నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ భవేష్ మిశ్రా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ బలోపేతనికి కృషి

## యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్



ఆర్మూర్ ఆగస్టు 21 (ప్రజాగళం) యువజన కాంగ్రెస్‌ను గ్రామస్థాయి నుండి బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ అధ్యక్షులు బైండ్ల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం నందిపేట్ మండల కేంద్రంలో ఆర్మూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి యువజన కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ బైండ్ల ప్రశాంత్ మాట్లాడుతూ, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, యువతను పెద్ద సంఖ్యలో యువజన కాంగ్రెస్‌లో భాగస్వామ్యం చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు గుండు హరీష్,, మాక్లూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినోద్, నందిపేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దూద వెంకటేష్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, నందిపేట్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పిరాజీ నాగరాజు, డొంకేశ్వర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వంశీ రెడ్డి తదితరులతో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు అక్బర్, అజార్, గౌతమ్, సందీప్, హరీష్, రాజు, రాకేష్, నరేష్, హైమద్, సంతోష్, అనిల్, ఆదర్శ్, సాయి మరియు పలువురు యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## ఆర్మూర్ సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిలు : అంకాపూర్ లో ఫ్రైడే డ్రై డే





ఆర్మూర్ ఆగస్టు 21 (ప్రజాగళం) సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆర్మూర్ వైద్య సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిలు అన్నారు. శుక్రవారం దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అంకాపూర్ గ్రామంలో శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ సభ్యులకు అధికారి సాయిలు ప్రజలతో మాట్లాడుతూ,, ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి నీటి నిల్వలు, లార్వా నిల్వలను పరిశీలించిరు .ఇంట్లో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. కుటుంబంలో జ్వరాలు వ్యాధులు ఉన్నాయా అంటూ తెలుసుకుంటూ సర్వే నిర్వ హించారు. గ్రామపంచాయతీ సిబ్బందితో డ్రైనేజీల్లో,నీరు నిలువ ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్, తిమ్మాపాస్ ద్రావణాన్ని చెల్లించారు. దోమ పెరిగే ప్రాంతాలను గుర్తించి స్ప్రే చేయించారు . గ్రామంలోని ప్రజలకు ఈ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు .ఈ కార్యక్రమంలో అంకాపూర్ సర్పంచ్ అంక్సాపూర్ దేవేందర్. దేగాం హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ ఎండి హాఖిల్, సంతోష్, రాజ్యలక్ష్మి, రేఖ , ఆశాలు గ్రామపంచాయతీ సిబ్బంది ఇతరులు పాల్గొన్నారు.

# ఈ నెల 24 నుండి రాష్ట్రవ్యాప్తంగా ఆటో సేవలు బంద్.

## -యుటీయుసి జిల్లా కన్వీనర్ కటారి రాములు వెల్లడి.




నిజామాబాద్ , ఆగష్టు 21(ప్రజాగళం ) ఆటో కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 24 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆటో సేవలు నిలిపివేస్తున్నట్లు యుటీయుసి జిల్లా కన్వీనర్ కటారి రాములు వెల్లడించారు. శుక్రవారం యునైటెడ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (యుటీయుసి) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాందేవ్ వాడలోని ఆర్ఎస్పి పార్టీ జిల్లా కార్యాలయంలో ఆటో కార్మికుల సమస్యలు, వారి న్యాయమైన డిమాండ్లపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కటారి రాములు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత శాఖలు ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24వ తేదీ నుండి ఆటో సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్టీసీ యాజమాన్యానికి ఈ-వి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆటో రవాణా రంగ కార్మికుల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యం లో ఆటో చార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు.

ఓలా, ఉబర్, రాపిడొ వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నా యంగా ప్రభుత్వం స్వయంగా ఒక ప్రజా ప్రయోజన యాప్‌ను తీసుకురా వాలని సూచించారు. అక్రమంగా ఉబర్ రాపిడొ ద్వారా నడుస్తున్న టూ వీలర్ టాక్సీలను వెంటనే నిషేధించి, ఆటో కార్మికుల జీవనోపా ధిని కాపాడాలని కోరారు. ఎన్నికల హామీ ప్రకారం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12,000 ఆర్థిక సహాయం అందించాలని, ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆటో డ్రైవర్లను ఈ-చలాన్ల నుంచి మినహాయించాలని అన్నారు. జీవో నెం. 263లో పేర్కొన్న మిగిలిన ప్రయోజనాలను వెంటనే అమలు చేయాలని, వాహన సారథి పోర్టల్‌లో ఆటో డ్రైవింగ్ లైసెన్స్ సదుపాయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జీవో ఎంఎస్ నెం. 60 ప్రకారం రవాణా వాహనాలకు రేడియం స్టిక్కర్లు తప్పనిసరి చేసిన నిబంధన నుంచి ఆటోలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ ఆధారిత సోషల్ సెక్యూరిటీ బోర్డులో ఆటో, క్యాబ్ కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని, ఆటో కార్మికులకు యాక్సిడెంట్ బీమాను కొనసాగించడంతో పాటు సాధారణ మరణాలకు కూడా వర్తింపజేయాలని అన్నారు.

50 సంవత్సరాలు పూర్తయిన ఆటో కార్మికులకు నెలవారీ పింఛన్ అందించాలని, ఆత్మహత్య చేసుకున్న ఆటో కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆటోల బంద్ కారణంగా అన్ని వర్గాల ఆటో కార్మికులు, ప్రయాణికులు, ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు, ప్రజాస్వామ్య శక్తులు, సామాజిక సంస్థలు పూర్తి మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్ల నరేష్, విన్ను గౌడ్, అబ్దుల్ ముజీబ్, ఇమ్రాన్, బాల ముకుంద, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సాటాపూర్ గేట్ వద్ద బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాస్తారోకో.

## తక్షణమే యూరియా యాప్ రద్దు చేసి పూర్వపద్ధతిలోనే యూరియా ఇవ్వాలి, రైతులు,నాయకులు డిమాండ్.



ఎడపల్లి,ఆగస్టు 21: (ప్రజా గళం) : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రం శివారులో ని సాటాపూర్ గేట్ వద్ద గురువారం బోధన్ - నిజామా బాద్ ప్రధాన రహదారిపై బిఆర్ఎస్ పార్టీ ఆద్వర్యంలో రైతులు,నాయకులు,కార్యకర్తలు రాస్తారోకో నిర్వహించారు.సుమారు 20 నిమిషాల పాటు నిర్వహించిన రాస్తారోకో వల్ల బోధన్ - నిజామాబాద్ వైపు వెళ్ళు వాహనాల రాకపోకలు నిలిచి పోవడంతో ట్రాఫిక్ స్థంభించి పోయింది.రాస్తారోకో నిర్వహిస్తున్న స్థలానికి ఎస్ఐ రేణుక,పోలీస్ సిబ్బంది చేరుకొని రాస్తా రోకోను విరామింప చేశారు.అనంతరం పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిపి కొండెం గల శ్రీనివాస్,మండల పార్టీ నాయకులు దుబ్బాక రవీందర్ గౌడ్,ఆకుల శ్రీనివాస్ లు విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు ఎరువుల విక్రయం కోసం ప్రవేశ పెట్టిన యూరియా యాప్ తో గ్రామాల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,స్మార్ట్ ఫోన్ లేక కొందరు,యాప్ తెలియక అనేక మంది రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.కష్టపడి యాప్ ద్వారా ఎరువులు బుకింగ్ చేసుకున్న రైతులకు సహకార సంఘాల ద్వారా ఎరువులు ఇవ్వకుండా,వారికి ఎరువులతో పాటు ఇతర మందులు కొంటేనే ఎరువులు ఇస్తామంటూ మెలిక పెట్టి రైతులను ఆర్థికంగా నష్టపరుస్తున్నారని ఆరోపించారు.ఈ విషయం వ్యవసాయశాఖ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అన్నారు.రైతులకు యాప్ ద్వారా ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులు తీసుకోవాలని లింక్ పెడుతున్న సహకార సంఘాల పనితీరును నిరసిస్తూ,రాస్తారోకో నిర్వహించారు.తక్షణమే ఎరువుల బుకింగ్ యాప్ ను రద్దు చేయాలని,ఎరువుల కొంటే ఇతర మందులు కూడా కొనాలని మెలిక పెడుతున్న సహకార సంఘా లపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గైని పోచయ్య, బిఆర్ఎస్ నాయకులు నాగేందర్ రెడ్డి,రాజిరెడ్డి,గడ్డం శ్రీనివాస్, ఆకుల సురేష్.మహేందర్ రెడ్డి, మల్క స్వామి,ఎంబ రాజేశ్వర్, మల్కన్న,యాదగిరి గౌడ్, సురేష్ గౌడ్,అరుగుల నాగరాజు,మదుగౌడ్,కిష్టపురం రవి,మియా జానీ,యూసుఫ్, షేక్.జావీద్(బాబా),దశరథ్, పాషా ఖాన్,రవిగౌడ్,స్వామి, అల్తాఫ్,జీవన్ రెడ్డి,అల్తాఫ్, లాయక్ అలీ,ముస్తాక్,హస్సేన్, బర్దిపూర్ ప్రవీణ్,అంబం అబ్బయ్య,గిర్ని గంగప్రసాద్, పలువురు పార్టీ కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం... ప్రజల పక్షం...
ప్రజాగళం
తెలుగు దినపత్రిక



# వైభవోపేతంగా వరలక్ష్మి వ్రతం పూజ



నిజామాబాద్ ప్రతినిధి ప్రజా గళం: వైభవోపేతంగా వరలక్ష్మి వ్రతం పూజ నిర్వహించినట్లు బ్రహ్మశ్రీ జోషి, ఋగ్వేద ఘన పాటి మధుసూదన్ శర్మ తెలిపారు. శుక్రవారం నగరంలోని మారుతి నగర్ అంజలి పార్కు వద్ద అమ్మవారి భక్తురాలు సౌమ్య ఇంటిలో పూజ కార్యక్రమం ఏర్పాటు చేశారని తెలిపారు. వరలక్ష్మి వ్రతానికి ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని, వివాహిత మహిళలు కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కోసం అష్టలక్ష్మీ స్వరూపిణి అయిన వరలక్ష్మీదేవిని పూజించి ఉపవాస దీక్షలు ఆచరి స్తారన్నారు. అమ్మవారిని కలశంలో ఆవాహన చేసి, పసుపు-కుంకుమ, కొత్త వస్త్రాలు, అలంకరణతో భక్తితో పూజించి, పిండి వంటలు, పరమాన్నం, వివిధ రకాల తీపి పదార్థాలను అమ్మవారికి నివేదిస్తారని, పూజ ముగిసిన తర్వాత ముత్తైదువులకు తాంబూలం, రవికెలు, కానుకలు అందజేయటంతో పూజ కార్యక్రమం పూర్తి అవుతున్నారు. అమ్మ దయ ఉంటే అన్ని సమకూరుతాయని భక్తుల విశ్వాసం అన్నారు.

# హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

## ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్.



ఆర్మూర్ ఆగస్టు 21 ( ప్రజాగళం) పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు కారుకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలో పీ డి ఎస్‌యూ ఆధ్వర్యంలో బీసీ హస్టల్ విద్యార్థులతో కలిసి ర్యాలీగా నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగిన ర్యాలీ. విద్యార్థులు కొవ్వొత్తులతో రూపరెడ్డి ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు. మానవహారంగా ఏర్పడి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా డియర్ ఫౌండేషన్ చైర్మన్ కీరవత్రి రాజశేఖర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ రూపరెడ్డి దారుణ హత్య అత్యంత దారుణమన్నారు. సమాజానికే తలవంపులు తెచ్చే ఘటనాని, విద్యను దీపంలా పంచిన గురువుకే ఇలా జరగడం అందరిని కలచివేస్తోందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని, పోలీసు శాఖను డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు నరేంధర్, నిఖిల్, వచన, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనాథ చిన్నారులకు అండగా నిలిచిన సామాజిక కార్యకర్త ఆడే జైపాల్



గుడిహత్నూర్: తల్లిదండ్రులను కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అనాథ పిల్లలకు సామాజిక కార్యకర్త, యువ నాయకుడు ఆడే జైపాల్ అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు. గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన లట్పటే జగన్నాథ్ కుమారుడు మారుతి, కోడలు గత సంవత్సరం క్రితం మృతి చెందడంతో వారి ముగ్గురు పిల్లలు అనాథలయ్యారు. ఆ చిన్నారులకు ఆధార్ కార్డులు రాక సుమారు ఒకటిన్నర సంవత్సరంగా కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ?ఈ సమస్యను కుటుంబ సభ్యులు ఆడే జైపాల్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో పాటు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పిల్లలకు ఆధార్ కార్డులు మంజూరయ్యేలా కృషి చేశారు. అనంతరం జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ద్వారా ఆ పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సహాయం అందేలా చొరవ చూపారు. ప్రభుత్వ సహాయం పొందేందుకు తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో, తన సొంత పనిగా భావించి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పత్రాలను సమర్పించి మరణ ధ్రువీకరణ పత్రాలు అందేలా పూర్తి బాధ్యత తీసుకున్నారు. ?తమ కష్టకాలంలో పెద్ద దిక్కుగా నిలిచిన జైపాల్ అన్న దేవుడిలా ఆదుకున్నారని పిల్లల కుటుంబ సభ్యులు భావోద్వేగంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే జైపాల్ మాట్లాడుతూ, ఓపిక ఉన్నంతవరకు మాత్రమే కాకుండా ఊపిరి ఉన్నంతవరకు నిరంతరం ప్రజాసేవలోనే ఉంటానని స్పష్టం చేశారు. పేద ప్రజల ముఖాల్లో కనిపించే చిరునవ్వే తనకు కొండంత బలమని, తన దృష్టికి వచ్చే ప్రతి సమస్యను పరిష్కరించడమే తన ప్రథమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# ప్రైవేట్ ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసు కోవాలి.

ఉపాధ్యాయులపై దాడులను అరికట్టాలి.
తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియే షన్(ట్రస్మా) ప్రతినిధులు డిమాండ్..
రూపారెడ్డి హత్య ను ఖండిస్తూ బోధన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల విద్యా సంస్థల యాజమాన్యం భారీ ర్యాలీ.
బోధన్ ఆర్డీవో విజయ కుమారికి వినతి పత్రం అందజేత...



బోధన్ ప్రతినిధి,ఆగస్టు 21: (ప్రజా గళం): ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు,సిబ్బంది భద్రతకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (ట్రస్మా)ప్రతినిధులు డిమాండ్ చేశారు.నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్యకు నిరసనగా శుక్రవారం బోధన్ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో,రూపారెడ్డి అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ,ప్రైవేట్ విద్యా రంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆర్డీవోను కలిసి వినతి పత్రం అందజేశా రు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరార.ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. విద్యార్థుల ప్రవర్తనపై తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.పిల్లలు చెడు అలవాట్లు,వివిధ రకాల వ్యసనాలకు లోనుకాకుండా తల్లిదండ్రులు నిరంతరం గమనిస్తూ,వారికి మంచి చెడులపై అవగాహన కల్పిం చాలని కోరారు.పాఠశాలల్లో ఉపాధ్యాయులు,విద్యా ర్థులు,తల్లిదండ్రుల మధ్య సమన్వయం పెంచడం ద్వారా ఇటువంటి ఘటనలకు అడ్డుకట్ట వేయవచ్చు న్నారు.ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి,వారి రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ట్రస్మా ప్రతినిధులు కోరారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడుహొకొడాలి కిషోర్,పట్టణఅధ్యక్షుడుహొహరికృష్ణతో పాటు పలువురు ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల విద్యా సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు,సంఘాల ప్రతినిధులు తదిత రులు పాల్గొన్నారు.

# రైలులో అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత.

## ఇద్దరి అరెస్ట్... 24 కిలోల ఎండు గంజాయి స్వాధీనం.: వివరాలు వెల్లడించిన ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ స్వప్న.



నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 21( ప్రజా గళం ): ఒరిస్సా నుండి షిరిడికి రైలు లో తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి 24.3 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ స్వప్న వివరాలు వెల్లడించారు. శుక్రవారం తెల్లవారు జామున సాయి షిర్డీ ట్రైన్ లో గంజాయి రవాణా జరుగుతుందని విశ్వశనీయ సమాచారం మేరకు ఆర్పిఎఫ్ పోలీసులు, నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్ హెచ్ ఓ బృందం కలిసి సంయుక్తం గా రైల్లో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు.అందులో ఇద్దరు వ్యక్తులు అనుమాస్పదంగా వారి సీటు కింద రెండు సూట్ కేస్ లతో ప్రయాణిస్తుండగా, అనుమానం తో క్షుణ్ణంగా తరిఖీ చేశామన్నారు. సూట్ కేస్ లలో (24.3) కేజీ ల ఎండు గంజాయి గుర్తించడం జరిగిందన్నారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా ఎండు గంజాయి ఎక్కడి నుండి ఎక్కడికి రవాణా అవుతుందని, ఎవరిది అని వారిని ప్రశ్నించగా, మేము ఒడిశా నుండి షిర్డీ కి రవాణా చేస్తున్నట్లు వెల్లడించారన్నారు.ఈ రవాణాకు ఒక వ్యక్తి (పేరు తెలియదు)మాకు 10,000 ఇచ్చి షిర్డీ లో ఒక ప్లేస్ వద్ద ఆటో ఆగి ఉంటుంది ఆ ఆటో లో పెట్టి రావాలి అని చెప్పినట్టుగా తమకు వివరించారని ఎస్ హెచ్ ఓ స్వప్న తెలిపారు. ఎండు గంజాయితో పట్టుబడిన వారిలో ఒరిస్సాకు చెందిన . గణేష్ పోలి, దీపక్ సాహు గా గుర్తించడం జరిగిందన్నారు. వారి నుండి రెండు గంజాయితోపాటు రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుందామన్నారు. వీరిని కోర్టు లో హాజరుపరిచి రిమాండ్ కు పంపించుటకు పంపడం జరిగిందని స్వప్న తెలిపారు. ఈ తనిఖీలలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, ఆర్ పి ఎఫ్ ఎస్ ఐ వెంకటేశ్వర్లు, ఎక్సైజ్ సిబ్బంది శైలేష్, సలీం, దేవేందర్ తో పాటు ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి. బీజేవైఎం.




బాన్సువాడ, ఆగస్టు 21, ప్రజా గళం : రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం, బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం బాన్సువాడ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పట్టణంలోని ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, మాజీ ఎమ్మెల్యే ఎండల లక్ష్మీనారా యణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. నిధులు విడుదల కాకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులుపడుతున్నారని, పేద, మధ్యతరగతి కుటుం బాలకు చెందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక చదు వులను మధ్యలోనే నిలిపి వేసే పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయం లో ప్రతి విద్యార్థికి స్కాలర్ షిప్ అందించి ఉన్నత విద్యకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చి, అధికారం లోకి వచ్చిన తర్వాత హామీలను నెరవేర్చడం లేదని విమర్శించారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించ డంలో ప్రభుత్వం విఫల మైతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్య క్రమాలు చేపడతామని హెచ్చరించారు.విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించలేని ప్రభుత్వం వెంటనే ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిరంజీవి, ఉమేష్, బీజేపీ రూరల్ అధ్యక్షుడు శ్రీనివాస్, నస్రుల్లాబాద్ మండల అధ్యక్షుడు హనుమాన్లు, బీర్కూర్ మండల అధ్యక్షుడు సాయికిరణ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీజేవైఎం మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు తృప్తిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com